క్లుప్తంగా

రక్షణ కంచె సవరించారు..!



సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న రక్షణ కంచెలకు విద్యుత్ సరఫరా అవుతుందని 'షాక్ కొడుతున్న రక్షణ కంచె' అనే శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. టౌన్-1 ఏఈ మల్లేశ్ విద్యుత్ సిబ్బందితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ కంచె, ఫీజు వైర్లు, ఫీడర్లు సవరించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

'తల్లిపాలు బిడ్డకు అమృతం'



జన్నారం: గర్భిణికి సీమంతం

జన్నారం/తాండూర్/దండేపల్లి/మంచిర్యాలటౌన్: తల్లిపాల వారోత్సవాలు బుధవారం కొనసాగాయి. తల్లిపాలే బిడ్డకు అమృతం వంటివని అధికారులు సూచించారు. గర్భిణులకు సీమంతం చేశారు. బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్ర రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ శ్రీధర్,ఎస్ఆర్‌కెఎం కాలేజీ కరస్పాండెంట్ పోటు తిరుపతి రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుజాత, జన్నారంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ కవిత, టీచర్లు విజయలక్ష్మి, వాణి, తాండూర్‌లో బెల్లంపల్లి సీడీపీవో స్వరూపరాణి, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, దండేపల్లిలో సూపర్‌వైజర్ వసంత, అంగన్‌వాడీ టీచర్లు శైలజ, రమా, వసంత, స్వప్న, సుజాత, ఏఎన్ఎంలు విజయ, విజయకుమారి ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

'ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు'

బెల్లంపల్లిరూరల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదని బెల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గోమాస శ్రీకాంత్, బాధితులు అన్నారు. మాలగురిజాలలో ఏగోలపు రమాదేవికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం పునాది గుంతలు తవ్వుతున్న క్రమంలో బుధవారం కామెర లక్ష్మి కుటుంబీకులు అడ్డుకున్నారని శ్రీకాంత్, బాధితులు వాపోయారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యల బంధువులైన కామెర లక్ష్మి, నారాయణ, ఉదయ్‌లు నిరుపేదల ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటే కనీసం నోరు మెదపడం లేదని ఆరోపించారు. ఈ వ్యవహారానికి చిన్నయ్యనే బాధ్యత వహించి నిరుపేద బాధితులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో చిన్నయ్య ఇంటిని ముట్టడిస్తామని శ్రీకాంత్, బాధితులు మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

విజయవంతం చేయాలి

దండేపల్లి/భీమిని: ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సేనా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, ఆదివాసీ సంఘం కన్నెపల్లి మండల అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. వేడుకల నిర్వహణపై దండేపల్లి, కన్నెపల్లిలో వేర్వేరుగా బుధవారం సమావేశాలు నిర్వహించారు. వేడుకలకు ఆదివాసీ సంఘాల నాయకులతో పాటు, ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఢిల్లీకి తరలిన బీసీ ప్రతినిధులు

పాతమంచిర్యాల/జైపూర్/చెన్నూర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం పొందేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవడమే లక్ష్యంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం తలపెట్టిన ధర్నాకు జిల్లా కేంద్రం, చెన్నూర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీసీ ప్రతినిధులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్, శివ, సుధాకర్, వెంకటేశ్, శ్రవణ్, నగేశ్, సత్యనారాయణ, ఓదెలు, శశిధర్, నరేశ్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలకంఠేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు భవనాలు కరువు

- శిథిలావస్థ, అద్దె భవనాల్లోనే పరిపాలన
- ముందుకు సాగని నూతన భవన నిర్మాణ పనులు



పిల్లర్ల దశలోనే దుగ్నెపల్లి పంచాయతీ భవనం

బెల్లంపల్లిరూరల్: గ్రామీణులకు సుపరిపాలన, మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన గ్రామ పంచాయతీలు సమస్యలతో సతమతమవుతున్నాయి. గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక అద్దె, శిథిలావస్థ భవనాల్లోనే అరకొర వసతుల నడుమ పాలన సాగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించలేకపోతున్నాయి. నూతన భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారాయి.

బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో...

బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో 114గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో 55గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి. బెల్లంపల్లి మండలంలో 11, తాండూర్‌లో 6, కాసిపేటలో 12, నెన్నెలలో 6, వేమనపల్లిలో 9, భీమినిలో 7, కన్నెపల్లిలో 4నూతన భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 47, ఐటీడీఏ ద్వారా 8 గ్రామ పంచాయతీల నిర్మాణాలకు అనుమతులు లభించాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులు కేటాయించారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...

గ్రామ పంచాయతీలకు నూతన భవనాలను మంజూరు చేస్తూ దాదాపు రెండేళ్లు కావస్తున్నా నేటికీ పనులు ముందుకు సాగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. రూ.11కోట్ల నిధులతో 55గ్రామ పంచాయతీల నూతన భవనాలు మంజూరైనప్పటికీ, కొన్నిచోట్ల పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. కొన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభమైనప్పటికీ నత్తనడకన సాగుతూ అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. ఏ ఒక్క భవనం కూడా పూర్తి హంగులతో నిర్మాణాన్ని పూర్తి చేసుకుని ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణాలు నిలిచినప్పటికీ వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

గ్రామ పంచాయతీల నూతన భవనాల నిర్మాణాలు ఆలస్యంగా సాగుతున్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్మాణాలు కొన్ని దశలకు చేరి ఉన్నాయి. నిధుల విడుదలపై సతమతం అవుతూ గుత్తేదారులు పనులు చేపట్టడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– సఫ్దర్ అలీ, డీఎల్‌పీవో, బెల్లంపల్లి

రోడ్డు భద్రత పాటించాలి

- ఏసీపీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్: వాహనాల డ్రైవర్లు రోడ్డు భద్రత పాటించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీరాంపూర్ సర్కిల్ పరిధిలోని విద్యాసంస్థల వాహన డ్రైవర్లకు, యజమానులకు బుధవారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. శ్రీరాంపూర్ సింగరేణి ఎంవీటీసీలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. బస్సు డ్రైవర్లకు హెల్పర్, క్లీనర్లు ఉండాలన్నారు. ఓవర్ స్పీడ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన ఫిట్నెస్, ఆర్సీ, పొల్యూషన్, ఇన్సూరెన్స్ వంటి అన్ని పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ రోడ్డు భద్రత ప్రమాణాలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్సైలు సంతోష్, లక్ష్మీప్రసన్న సిబ్బంది పాల్గొన్నారు.

సుష్మాస్వరాజ్‌కు నివాళులు



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో దివంగత కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శులు మేరడికొండ శ్రీనివాస్, బింగి సత్యనారాయణ, బొద్దున మల్లేశ్, డాక్టర్ రఘునందన్, ఆవిడపు రాజబాబు, రాకేశ్ రెన్వా, దుర్గాప్రసాద్, గుండా రాజబాబు, తరుణ్‌సింగ్, తాజ్‌ఖాన్, పోనవేణి రవీందర్, కిషోర్‌గౌడ్, దేవేందర్, పూదరి రాంచందర్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే తహసీల్దార్ మృతి'



మౌనం పాటిస్తున్న తహసీల్దార్ సతీశ్‌కుమార్, సిబ్బంది

నెన్నెల: అక్రమ పట్టాల విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్ జ్యోతిపై ఒత్తిడి తేవడం వల్లే ఆమె గుండెపోటుతో మృతి చెందిందని మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి ఇబ్రహీం ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే వినోద్ అండదండలతో మండలంలో కాంగ్రెస్ నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ఇంట్లో పనిచేసే ఓ నాయకుడు అక్రమ పట్టా చేయించడం వల్లే గత తహసీల్దార్ సస్పెండ్ అయ్యారని చెప్పారు. నాయకుల ఒత్తిళ్లు అధికం కావడం వల్లే నెన్నెల మండలానికి రావడానికి అధికారులు వెనకడుగు వేస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ జ్యోతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్, నవీన్, తాజ్, మహేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ మృతికి సంతాపం

మందమర్రిరూరల్: నెన్నెల మండల తహసీల్దార్ జ్యోతి అకాల మృతి తీవ్ర బాధాకరమని మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జ్యోతి ఆత్మకు శాంతి కలగాలని సిబ్బందితో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

దండేపల్లి వాసికి డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టాతో రవి

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి రవి పశ్చిమ బెంగాల్‌లోని బిదాన్ చంద్ర కృషి విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ ఎంటమాలజీ(వ్యవసాయ కీటక అధ్యయన శాస్త్రం)లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అందులో పెసరలో యాజమాన్య పద్ధతులు, కాండం తొలుచు పురుగు నివారణపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. రవి తల్లిదండ్రులు పోషన్న–ప్రమీలా కూలీ పని చేస్తుంటారు.

'నిషేధం ఎత్తివేయడంలో నిర్లక్ష్యం తగదు'



మాట్లాడుతున్న ఖలీందర్ అలీఖాన్

జన్నారం: అటవీ శాఖ తీసుకున్న భారీ వాహనాల రాకపోకల నిషేధాన్ని ఎత్తివేయడంలో అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలీందర్ అలీఖాన్ ఆరోపించారు. రిలే నిరాహార దీక్షలకు భారత కమ్యూనిస్టు పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ బుధవానం స్థానిక నాయకులతో కలిసి దీక్షల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దాసరి తిరుపతి, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న, జన్నారం మండల కన్వీనర్ మామిడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ, సంపాదిత సెలవుల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అక్టోబర్ 2024లో బదిలీ అయిన ఉపాధ్యాయుల సప్లమెంటరీ వేతనాలు నేటికీ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఉపాధ్యాయులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో తపస్ నాయకులు సాంబయ్య, తిరుపతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి గనుల్లో ప్రమాదాలు జరగకుండా యాజమాన్యం భద్రతా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. ఏరియా జీఎం ఆఫీస్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించి అనంతరం ఏరియా పర్సనల్ మేనేజర్ (పీఎం) శ్యాంసుందర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్మికులకు నాణ్యమైన పనిముట్లు అందించి పని ప్రదేశాల్లో ఖచ్చితమైన రక్షణ చర్యలు చేట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు గోమాస ప్రకాష్, బోడింకే చందు, దూలం శ్రీనివాస్, అశోక్, ఉమారాణి తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



తిరుపతిని సన్మానిస్తున్న గల్ఫ్ కార్మికులు

జన్నారం: గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కృషి చేసినందుకు గాను అత్యున్నత ఐకానిక్ గోల్డ్ స్టార్ నంది అవార్డు అందుకున్న జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన అమరగొండ తిరుపతిని బుధవారం ఆ గ్రామ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు వేరువేరుగా సన్మానించారు.

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్ట్

తాండూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ కమిషనరేట్ ఎదుట ధర్నాకు వెళ్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాంతో పాటు పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై వదిలేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనలు, పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వరలక్ష్మి, సరిత, జహీరాబాను, శాంత, అనీషా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలి

చెన్నూర్: పట్టణంలోని పద్మనగర్ కాలనీలో 7గుంటల అబాది భూమిని అదే కాలనీకి చెందిన జడల సతీశ్ ఆక్రమించుకొని అక్రమ నిర్మాణం చేస్తున్నారని, నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని బుధవారం తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, ఎస్సైలకు వినతిపత్రాలు అందజేసినట్లు కాలనీవాసులు బెల్లంపల్లి ప్రమీల, మారగొని సరోజన, గట్టు సుజాత, మాదాసు లక్ష్మి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి: 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నీల్వాయి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఉంటుందని ఏఈ దీక్షిత్ తెలిపారు. నీల్వాయి, మామడ, వేమనపల్లి, కల్మలపేట, కేతన్‌పల్లి, ములకలపేట, రాచర్ల, గొర్లపల్లి, దస్నాపూర్, మంగెనపల్లి, రాజారాం, ఒడ్డుగూడం, సంపుటం, జాజులపేట, ముక్కిడిగూడం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐకేపీ ఏపీఎంగా చంద్రశేఖర్

మందమర్రిరూరల్: మండల ఐకేపీ ఏపీఎంగా బుధవారం చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు.

వనమహోత్సవం పకడ్బందీగా నిర్వహించాలి

చెన్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో వన మహోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో మహవాది దత్తకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రికార్డులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

మంచిర్యాలఅర్బన్: పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీగౌడ్ డిమాండ్ చేశారు. మంచిర్యాలలో బుధవారం పలువురు విద్యార్థులను విద్యార్థి సంఘంలోకి కండువాలు కప్పి ఆహ్వానించారు. సంఘంలో చేరిన వారిలో జతిన్‌గౌడ్, హర్ష, సాయికిరణ్, నవీన్, సందీప్ తదితరులున్నారు.

'సేంద్రియం'పై అవగాహన



చెన్నూర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం మండలంలోని శివలింగాపూర్ గ్రామంలోని గోశాలలో గోమాత గురించి, సేంద్రియ వ్యవసాయంపై యజమాని గోనె సతీశ్ అవగాహన కల్పించారు. ఆవును మనం గోమాతగా పూజిస్తామని వాటిని కాపాడుకోవాలని తెలిపారు. గోవుల పేడ, గో పంచకం ద్వారా మనం సేంద్రీయ ఎరువులు తయారు చేసుకొని వ్యవసాయం చేయవచ్చని పేర్కొన్నారు. పేడ ద్వారా వచ్చే పిడకలను ఎన్నో విధాలుగా వాడవచ్చన్నారు. రసాయన ఎరువుల ద్వారా కాకుండా సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యునిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న సంఘ సభ్యులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సంఘానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న సభ్యునిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం గీత కార్మిక పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. నిరుపేద గీత కార్మికులమంతా కలిసి గత కొన్ని సంవత్సరాలుగా సొసైటీ ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నామని, ఒక సభ్యుడు కోళ్ల రాజగౌడ్ సంఘానికి వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతూ నష్టం కలిగిస్తున్నారన్నారు. సభ్యులంతా కలిసి సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా అతన్ని సంఘం నుంచి తొలగించేందుకు తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, లచ్చగౌడ్, గంగధర్, సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్‌సార్ జయంతి



బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ వెంకటరాములు, అధికారులు, సిబ్బంది



జైపూర్: పవర్ ప్లాంటులో...



భీమారం: నివాళులర్పిస్తున్న అశోక్‌యాదవ్



శ్రీరాంపూర్: నివాళులర్పిస్తున్న జీఎం శ్రీనివాస్

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వరాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన జయశంకర్‌సార్ ఆశయ సాధనలో అంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

- మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సంపత్‌కుమార్, టీఎన్జీవోస్ భవన్‌లో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆనంద నిలయంలో వేర్వేరుగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.
- జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో డీటీవో సంతోశ్, హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, దొనబండలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం సభ్యులు నివాళులర్పించారు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములు నివాళులర్పించారు.
- దండేపల్లిలో అఖిల భారత విశ్వకర్మ మహాసభ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.
- జైపూర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వనజారెడ్డి, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, అధికారులు నివాళులర్పించారు.
- రామకృష్ణాపూర్, చెన్నూర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ రాజరమేశ్, కంభగోని సుదర్శన్‌గౌడ్, రామిడికుమార్, మాజీ సర్పంచ్ కృష్ణ, జెడ్పీటీసీ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.
- శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద జీఎం శ్రీనివాస్ నివాళులర్పించారు.
- మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో జయశంకర్ చిత్రపటానికి ఏరియా జీఎం దేవేందర్, అధికారులు, ఏఐటీయూసీ నాయకులతో కలిసి నివాళులర్పించారు.
- భీమారంలో గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- తాండూర్, కోటపల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, కాసిపేట, భీమిని మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ప్రజా యుద్ధనౌక, గాయకుడు గద్దర్ వర్ధంతిని బుధవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి శ్రేణులు పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకుడు నీరటి రాజన్న, ఇప్టూ, టీఎస్‌టీయూసీ, టీయూసీఐ నాయకులు ఎండీ చాంద్‌పాషా, టి.మణిరాంసింగ్, గోగర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.